# గద్దలు

కనుచూపుమేరంతా పచ్చని పంట పొలాలు. పొలుతాగుతున్న సద్ద, జొన్నకంకులు. వాటిమీద వాలుతున్న సీతాకోక చిలుకలు, చిన్న చిన్న పిట్టలు. అక్కడక్కడ విరగపూసిన సీతా ఫలాలచెట్లు, ఓమాదిరి మత్తు వాసన వెదజల్లుతుఉన్నాయి. ఆపూల మీద గుంపులు గుంపులుగా వాలుతున్న తేనెటీగలు. నలువైపుల పిల్ల బాటలు. ఒంపు ఉన్న చోట ఊదుల

గుంపులు. బాగా కాసిన పెసరచేను కాయలను వంగి ఏరుతున్న జనం అప్పుడప్పుడు లేచి నడుంకు చేతులు ఆనించుకుని నిలుచుని పలుకరించు కుంటున్నారు. వాళ్ల ముఖాలన్ని ఓ మాదిరి లావెక్కినయి కొందరి నుదిటి బొట్టు చెమటకు తడిసి ముక్కులెమ్మటి, కనుబొమ్మలెమ్మటి కారి ఆరినవి. చేను మధ్యలో ఉన్న బండ మీద కూర్చొని తాటినారను ముందేసుకుని పగ్గాలను పేనుకుంటూ చేను ఏరే వాళ్లకు కాపలాగా ఓజీతగాడు.

''పిల్లతల్లులారా సన్నీయాల్లయింది, పొయ్యి పాలిచ్చిరాండ్రి'' అంటు అందరివైపు చూసింది, ముసలమ్మ.

''అవునమ్మ పొద్దునొస్తే, నా బిడ్డ ఏడుస్తుండొచ్చు.'' గెట్టువైపు నడుస్తూ, పాలు సేపుతున్న రొమ్ములను అరచేతులతో అదుముకుంది ఓ తల్లి.

''తొందరగా పోదాం పదవమ్మ నా రొమ్ములు బిర్రుగ అయిపోయినయి.'' బిడ్డ గుర్తు రాగానే నడకలో వేగాన్ని పెంచింది.

''మా పిల్లకు ఇప్పుడే పండ్లొస్తున్నాయి. పొద్దున పాలిస్తుంటే రొమ్ము కొరికింది. నొప్పి పెట్టింది.'' ఓసారి తన ఎదను తానే చూసుకుంటూ అన్నదో తల్లి తనకంటె ముందు నడిచేటామెతో.

ఎదురుగ చెరువు కట్ట పక్కమ్మటే ఊరు. ఊళ్లోకి వెళ్లాలంటే కట్టెక్కి కొంత దూరం నడిచితే అవతల ఆ చివరెమ్మటే ఇండ్లు.

తమ తమ పిల్లలను తలుచుకుంటూ కట్టెక్కుతున్న ఆడవాళ్లు ఏదో భయంకర గొంతు విని అట్లానే నిల్చుండిపోయారు.

''సెప్పేది మీకేనే, ఎవ్వరు పాలియ్యపోవద్దు అన్నడు దొర.'' తోవ కడ్డంగ నిలుచొని. రెండు చేతుల మద్యన బరిసెను అటూ ఇటూ

తిప్పుతు అన్నాడు మస్కూరి.

దొర పెసరి చేను ఏరడానికి వచ్చిన ఇరువై మందిలో సగం పిల్లతల్లులే. కొందరు ఎడపిల్లల తల్లులైతే మరికొందరు పసిపిల్లల తల్లులు. బిడ్డలు గుర్తురాగానే ఉబికొచ్చే పాల ధారలు పిల్లలకు కుడిపితేనే కాని వాళ్లకు ఉపశమనం ఉండదు. మస్కూరి మాటలకు బిత్తర పోయి గోడ మీది బొమ్మల్లా ఉండిపోయారు. కొంతసేపు తరువాత తేరుకుని కదులుతూ.

''మేము పోకపోతే మా బిడ్డలు పాలగుండెలవిసి సస్తరు. రొమ్ములు గడ్డకట్టి మేం సస్తం'' కాస్త ధైర్యం చేసుకుని ఓ తల్లి తల్లడిల్లే చూపులతో అంది ఓ చేతిలో మరో చేతి నుంచి నలుపుకుంటు.

''గయ్యన్ని నాకు తెల్వవు. ఒక్కలు గూడ పోవద్దంతే దొర సెప్పిండు ఆఁ''. ఎవరి నోట మాట రాలేదు. అందరి కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. చలనం లేకుండా గాలి లేనప్పటి చెట్లలా నిలుచున్నారు.

''అగో సేర్‌దార్ వస్తున్నడు అడుగుండ్రి మరి'' అంటూ ఊర్లో నుండి కట్ట మీదికొస్తున్న సేర్‌దార్‌ను చూపించాడు.

''ఏందిరా సంగతి అందరేమో గీడ నిలబడ్డరు'' అడిగాడు.

''అయ్యా ఈల్లు పాలీయపోతారట'' బరిసె తోటే చేతులు జోడిస్తు.

''ఎందుకాపీనవు.''

''దొర తోలియ్యద్దు అన్నడు.''

భుజం మీద ఉత్తరీయాన్ని ఏళ్ల మధ్య పెట్టి ఉంచి రెప్ప వాల్చకుండ అందరివైపు ఒక్కసారి చూశాడు. కొందరు ఏడుస్తు నిలుచుంటే మరికొందరు చేతులు పిసుకుంటు నిలుచున్నారు.

''దొరా ..... పిల్లలు పాలగుండెలవిసి సచ్చి పోతరు. నీ కాళ్లు మొక్కుతం దొర పాలిచ్చి ఎమ్మటే ఉర్కొస్తం.'' అన్నారొక్కసారే

''మమ్ములను పోనీయండి దొర ఎమ్మటే వొస్తం.''

వాళ్లని ... మస్కూరీని మార్చి మార్చి చూసి - ''దొర సంగతి మీకు తెలుసు వద్దంటే వద్దు అంతే'' అంటూ ముందుకు నడువపోయాడు.

అందరు చేతులు జోడించి కళ్లనీళ్లు నింపుకుంటు - ''దొర మా పిల్లలు బతకరు. అక్కడ పాలు లేక నోరెండి ఆల్లు సస్తరు. ఇక్కడ రొమ్ములు బి(ర్రుగై మేం సస్తం'' అన్నారొక్కసారే మళ్లీ అందరు.

''ఎన్నన్న సేసి ఇడిసి పెట్టుం(డ్రి. తవరికి తెలవదా. ఇయ్యాల కొత్తా.''

''కొత్తేమీ కాదులేగాని దొర కాదంటె పిట్టలు నీళ్లు తాగవు తెల్వదా.''

''ఇంగెట్ల మరి అక్కడ ఆల్లు ఇక్కడ మేము సావాల్సిందేనా?

''దొర ఉఁ అనుం(డ్రి, ఉర్కి ఉర్కొస్తం.''

''దండం పెడ్తం దొర జర కనికరం సూపిం(డ్రి.''

''ఇంత నెనరు లేకుంటే ఎట్లా ఇగ రేపటి నుండి కూలన్నా-''

''మాస్తంటరు, రాకుం(డ్రి ఎండి సస్తరు'' మస్కూరి మాటలు.

''అట్ల సచ్చినా అందరు ఒక్కసారె సస్తం''

''సావుం(డ్రి, దొర ఆజ్ఞ ఆజ్ఞే''

''సూడు నీకు పెండ్లం, పిల్లలున్నరు, నీవు కూడ పాలిస్తే బతికినోనివే.'' అన్నది ఓ స్త్రీ ఉక్రోషంగా.

చెరువులో నీళ్లు తాగుతున్న పశువుల వైపు చూపు మల్లగ అక్కడ ఓలేగ దూడ తన తల్లావు పొదుగును సుతారంగా కుమ్ముతూ పాలు కుడుస్తూ ఉంటే, ఆవు అరమోడ్చిన కళ్లతో నెమరేస్తూ నిలుచుంది. పశువులు కట్టెక్కుతున్న అది కదలడం లేదు. ఆ దృశ్యాన్ని చూసిన శేర్‌దార్ మనస్సు కరగగ మనిషి కదిలిపోయి మస్కూరివైపు మల్లి, ''ఒరే ఇయ్యాల

ఒక్కరోజు పోనిద్దాంర.'' అన్నాడు.

''దండం పెడ్త దొర ఇయ్యాల్లైతే ఇడువుంండ్రి.''

''అరేయ్ అక్కడ వుము ఉంచు, ఇగ వాళ్లను పొమ్మను అది ఆరే లోపల రమ్మను. రానోల్ల పిర్రల మీద సింతబరిగెలు ఆడియ్యి.''

''ఆఁ ఇగ పోండ్రి ఇయ్యాల ఒక్కనాడు'' అంటూ అందరు సూడంగ కట్టమీద ఉమ్మిచ్చి, అక్కడ మస్కూరి నిలుచోగ సేర్‌దార్ కట్టమీద నడుస్తూ మరోసారి మంది వైపు మల్లి - ''చూడండ్రే దొర కంట్లె పడకుంట పోయిరాండ్రి సుమా లేకుంటే మీకు, నాకు అందర్కి దోసిత్తుల గాషారమే'' అని మరి చెప్పి తన తోవన తాను నడిచాడు.

అందరి ముఖాల్లోను బాధాపూరిత నవ్వు కదలగ ముక్కులను చీదుకుంటు ఊరివైపు నడిచారు.

మస్కూరి తాను వుమ్మిచ్చిన పక్కన బరిసెను దిగేసి నిలుచున్నాడు. పక్కమ్మటే తూర్పువైపు అతని కంటె పొడవుగ అతని నీడ.

••••

నిన్నటి లాగానే చేను ఏరుతూ ఉన్నారు. నిన్న పాలియ్యపోయి, ఆలస్యంగా వచ్చిన నలుగురైదుగురిని చింత బరిగెలతో కొట్టగ పడుకో రాకుంట, కూర్చో రాకుంట అయ్యింది. వంగి చేను ఏరుతూ ఉంటె బరిగెలెమ్మటే చర్మం లేచిపోయిన ఆ వాతల్లో నొప్పిని, ఆ బాధను, భరించడానికి మెల్లమెల్లగా అడుగులేస్తూ ఊపిరి బిగపడుతు ముఖాన్ని విరుచుకుంటువున్నారు. మధ్య మధ్యన ఒకరి దెబ్బలను ఒకరు చూసుకుంటు కన్నీరు కార్చుకుంటు ఉండగా మిగిలిన వాళ్లె ఓదార్చుతున్నారు.. ఈ ఊరికి ఇచ్చినందుకు తల్లితండ్రులను తిట్టుకున్నారు. తమను ఆడవాళ్లుగా పుట్టిచ్చినందుకు దేవున్ని తిట్టారు.

పేదవాళ్ల ఇంట పుట్టినందుకు తమను తాము తిట్టుకున్నారు.

అప్పుడే నిన్న వచ్చి ఈ రోజు రాని ఇద్దరు ఆడవాళ్లు ఊళ్లో నుండి పరిగెత్తుకొని వచ్చి, గెట్టుపీద పడిపోయారు. భయంతో వణికిపోతువున్నారు. బాధగ మూలుగుతున్నారు. అందరు చేను ఏరడం ఆపేసి వాళ్ల చుట్టు మూగారు.

ఒకామె వంటి మీది గుడ్డలు చినిగి ఉన్నాయి. కళ్లలో కన్నీరు ఇంకిపోయి చూపులు తేలగిలపడ్డాయి. కుడిచేతికున్న అయిదు వేళ్లను చూపిస్తూ, ఎడమ చేత్తో నలిగి పోయిన తన శరీరాన్ని చూపిస్తూ ఎక్కి ఎక్కి ఏడవసాగింది. అప్పుడామె గింజలు వల్చిన కంకి లాగుంది. రెండవ ఆమె ఏం జరిగింది చెప్పలేకపోతుంది. కన్నీళ్లు తప్ప నోట మాటలు లేవు. ఎర్ర సిరాతో తడిసిన గుడ్డలా ఆమె చీర, చుట్టూ ఉన్న జనం కళ్లతో అడిగారు. చేతులతో సైగ చేశారు. వరదకు నిండుతున్న గుంటల్లా ఆమె కళ్లు, బాధతో వణుకుతున్న ఆమె పెదాలు ఏదో చెప్పాలని, చెప్పలేని పరిస్థితి. అతి కష్టంగ ఆమె చూపుతో తన సింగులవైపు సైగ చేసింది. అది గమనించిన మరో స్త్రీ ఆమె చింగులను తొలగించగానే అందరూ నోళ్లు తెరిచి, ఒక చేత్తో ఎదను సర్సుకుంటు మరొక చేత్తో నోరు మూసుకున్నారు. బాకు దిగేసి లాగిన గాయంలా ఆమె మర్మావయవం. శరీరంలో రక్తంబొట్టు లేకుండా పోయింది. ఆమె శ్వాస అతి కష్టంగా తీస్తువుంది. ఆమె కళ్లు మెల్లి మెల్లిగా మూసుకోసాగాయి. ఇంకా ఏమో చెప్పాలని ప్రయత్నిస్తుంది నోట మాట రావడంలేదు. అది కష్టంగా కదిలి తల పైకెత్తి - ''ఆయనను ... నేను... నేను...'' అంటూ అందరివైపు చూసింది. అతి కష్టంగా చేతులు జోడించి ''నా బిడ్డను - జర - '' అంటున్నప్పుడు చేతులు పడిపోయినయి. తలపక్కకు వాలింది.

ఏడుపులు, పెడబొబ్బలు కొందరు చేతులు నలిపారు. మరికొందరు అరికాళ్ళను రుద్దారు. అయినా ఆమె ప్రాణం గాలిలో కలిసింది.

••••

పొద్దు బారెడెక్కింది. ఇంకాస్త అయితే పొలం పనుల కెల్లవలె ఊళ్లో డప్పు వాయిస్తు వీధి వీధి తిరుగుతు.

''దొర పొలంలకు కూలికి రావంని ఎవరన్న అంటె ఆల్లని ఊరెల్లగొట్టవల్సొస్తది. అందుకని మనపటోలనే కూలికి రావల్సిందని దొర ఆజ్ఞ్రో.''

మల్లి డప్పు సప్పుడు.

మల్లీ అవే మాటలు.

పెద్దలు ఎక్కడోల్లు అక్కడే నిలుచోని వింటున్నారు. పిల్లలు డప్పువానెమ్మటి తిరుగుతున్నారు. కోళ్ల తలలు పైకెత్తి వింటున్నాయి. పందులు పరుగెత్తుతున్నాయి. ఇంటి పనులు, వంట పనులు చేసుకుంటున్న ఆడవాళ్లల్లో గుబులు మొదలైంది. మొన్న చింత బరిగెలు, నిన్న గడిల ఒక్కదాన్ని ఐదుగురితోటే... అంతేకాదు అటు కూలికి రాను ఇటు పండను అన్నందుకు గొడ్డలి కామను ఊడతీసి ఆడమనిషికి దిగేస్తె ఆ బాధ బరించలేక ఆమె దిక్కులేని సావు గుర్తుకు రాగ గడగడ వణుకుతున్నారు.

ఆగి- ''పిల్ల తల్లులను తమ పిల్లలకు పాలు ఇచ్చేట్టు గూడ సూస్త అని దొర ఆజ్ఞ్రో'' అనగానే వణుకుతున్న దడ తగ్గగ కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్కమాట. నలుగురు నాలుగు మాటలు. ఎవరు ఏం మాట్లాడిన దొర మాట దాటలేరు కదా.

నిన్నటి పీనుగను నిన్న పూడిచేశారు. ఎవ్వరు ఏడ్చేది లేదు. ఎక్కడ

చెప్పేదు లేదు. చావుబతుకుల మద్యన కొట్టుకాడుతున్న మరొకరికి మంగలి యాధయ్య దగ్గర మందు ఇప్పిచారు ఆడవాళ్లందరు. కాని వాళ్ల ముందు కళ్లు మూసుకోకపోవడం తప్పడం లేదు. హైదరాబాదు వచ్చిన సాయెబులు, గూండాలు, దాదాలు చుట్టు పట్టు జాగీర్లు ఇంకా సర్కారు ఆఫీసరులు మరెందరో ఆ గడిలోనే ఉంటుంటారు. వాళ్లకు తిండికావాలి, తాగుడు కావాలి, తాగినంక కోరిక తీర్చే ఆడది కావాలి. ఊరంత బాధల బతుకైపోయింది. గడి ఓ జైల ఆయిపోయింది.

రోజులాగె అందరు దొరగారి పొలం పనికి వెళ్లారు. రోజులాగె పాలివ్వ వెళ్లే పిల్లతల్లులు గెట్టు మీదికొస్తున్నారు. పడుతూ లేస్తూ పరుగెత్తుకొస్తున్నాడు మస్కూరి. చేతిలో బరిసె, బుజాన గోనె సంచి గెట్టు మీదకొచ్చి నిలుచున్న వాళ్ల ముందు తాను గోనె సంచిలో తెచ్చిన మ(రాకు డొల్లలను గుమ్మరించగ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. ఎవ్వరికి ఏమీ అర్థం కాలేదు.

మస్కూరి మౌనపు చూపులు.

ఆడవాళ్ల అర్థంకాని అమాయకపు చూపులు.

''హొఁ పిల్లతల్లులు తలా ఒక డొల్లి తీసుకోం(డి.''

అందరు బిత్తరబోయి చూస్తువున్నారు.

''మీకేసెప్పేది'' కాస్త కోపంగా, వీడు గడిలో ఎంగిలి తిని బలిసినోడు. వంగి తీసుకున్నారందరు.

''రవికల ముడులు ఇప్పు(రి దొరొస్తుండు'' బరిసెని తలకిందులుగా దిగేస్తు అక్కడి నుండి కాస్త కదులుతూ అన్నాడు.

కొమ్మ గొడ్డలికామై చెట్టును నర్కుతున్న దృశ్యం! ఎటు అర్థంకాని ఆడవాళ్లు చేతుల్లోకి డొల్లలు తీసుకుని రవిక ముడి వేసిన చోట మరో

చేయిని ఉంచి భయం భయంగా నిలుచున్నారు.

''మీకే సెపుతున్న రయికెలు ఇడువు(ర్రి ఈ డొల్లల్లో -''

''ఆ డొల్లల్లో - ''

''పాలు పిండు(ర్రి.''

అయితే అన్నట్టు చూశారు అందరు ఒక్కసారె.

''ఆటిని తీసుకుపోయి మీ పిల్లలకు తాపిస్తం గంతె - ఇగ పాలియ్యపొయ్యేది లేదు. మీరు పిల్ల తల్లులో కాదోగూడ, దొర సాయంగ సూస్తడు''.

కాలం కాసేపు ఆగినంత నిశ్శబ్దం.

అందరి ఎదల్లో దుఃఖపు అలలు. చెవుల్లో పిల్లల ఏడుపులు, తమ కళ్లముందే తమ పిల్లలను గొంతు పిసుకుతున్న దృశ్యం. ఇద్దరు కళ్లు తిరిగి పడిపోయారు. మరికొందరు ఒకరి నొకరు పట్టుకొని ఏడుస్తున్నారు.

అప్పుడే ఊళ్లో నుండి ఓకోడి పిల్లను తన్ను కొస్తున్న గద్ద కళ్లల్లో పొడుస్తూ ఉంటే, కోడిపిల్ల 'కియాం కియాం' అని అరుస్తూ వుంది.

•1994

ఆంధ్రప్రభ

ఆగస్టు '95